

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**సాంబశివరావు** ఓపికగా పదయ్యేదాకా మేలుకుని వున్నాడు. తరువాత అడిగాడు.

"ఇంక నీ చదువు చాలు. పడుకోవచ్చుగా?"

నీరజ జవాబు చెప్పలేదు. తను చదువుతోన్న లియోనార్డు జునిన్, నటాలి జునిన్ రాసిన 'కాంటాక్ట్ ది ఫస్టు ఫోర్ మినిట్స్' అనే పుస్తకాన్ని చదవటం ఆపలేదు.

"సెక్స్ నవల్లా వుందే పేరు?" అడిగాడు సాంబశివరావు.

దానికీ సమాధానం చెప్పలేదు. అది చదవటం అయ్యాక నీరజ దాన్ని తన పుస్తకాల షెల్ఫ్‌లో వుంచి, అలమరలోంచి ఓ పాత తెలుగు పుస్తకాన్ని అందుకుని తెరిచింది. పేరు పొగమంచు.

"అంత పాత నవల చదువుతున్నావెందుకు?" అడిగాడు సాంబశివరావు.

"నవల కాదిది - కథలు."

"ఇప్పుడెందుకు వాటిని చదవటం?"

"ఇది అచ్చయినప్పుడు నేను ఇంకా పుస్తకాలు చదవటంలేదు కాబట్టి."

"రేపు మధ్యాహ్నం చదవచ్చుగా."

"ఈయన నా అభిమాన రచయిత. రేపటిదాకా ఆగలేను. ఈయన రాసిన పుస్తకాలన్నీ చదువుతాను."

"ఎన్ని వున్నాయ్?"

అలమరవంక చూపించింది.

"ఈ రాత్రికే?"

"నీ అభిమాన రచయిత పేరేమిటి?" అడిగాడు సాంబశివరావు.

"పెద్దిబొట్ల సుబ్బరామయ్యగారు."

"ఎంతసేపు పడుతుంది అవన్నీ పూర్తవడానికి?"

"రాత్రి రెండు కావచ్చు."

"నువ్వు పడుకోబోయేముందు నన్ను లేపు. ఒకవేళ నాకు నిద్ర వస్తే?

"లేపను"

"ఏం?"

"పుస్తకాలు పూర్తయ్యాక కానీ ఈ రాత్రి పడుకోను. పేషన్స్ అనుకుంటాను."

"తెల్లవారేదాకా?"

"తెల్లవారే దాకానా?"

"మరి యూనివర్శిటీకి?"

"వెళ్తాను."

"ఎందుకు ఇలా?"

"రేపు రాత్రయినా హాయిగా నిద్రపోవచ్చని."

"నీరజా! యూ ఆర్ బీయింగ్ స్టుపిడ్"

"నా అభిమాన రచయిత కథ చదివేప్పుడు నన్ను డిస్టర్బ్ చేయకండి. ఒకో వాక్యం ఆయన మనసులోంచి వచ్చాయా అన్నట్లుగా మాటలు పేర్చబడ్డాయి."

సాంబశివరావు చిన్నగా నిట్టూర్చి మంచం మీంచి లేచి కూర్చున్నాడు.

"మనం హనీమూన్ నుంచి వచ్చినప్పటినుంచి ఒక్కసారికూడా నువ్వు నాతో ప్రేమగా మాట్లాడలేదన్న సంగతి గుర్తుందా?" అడిగాడు.

నీరజ సీరియస్‌గా చూస్తూ చెప్పింది.

"నా అభిమాన రచయిత పెద్దిబొట్ల సుబ్బరామయ్యగారి కథ చదువుతున్నప్పుడు నన్ను డిస్టర్బ్ చెయ్యడం నాకు నచ్చలేదని ఇందాక చెప్పాను"

"ఆల్‌రైట్. దాగుడు మూతలెందుకు? నువ్వేం చేయదలచుకున్నావో చెప్పు?" అడిగాడు సాంబశివరావు నిటారుగా కూర్చుని.

నీరజ తక్కున పుస్తకం మూసింది. భర్తవంక చూస్తూ చెప్పింది.

"మీరు చెప్పింది అబద్ధం. రాజేష్ మీ కొడుకు అని రుజువైంది. విజయవాడ వెళ్ళింది ఇది నిజమా అబద్ధమా అని తెలుసుకోడానికే."

"రాజేష్ నా కొడుకని రుజువైందా?" తెల్లబోతూ చూశాడు.

"అవును"

"డామిట్. ఎవరో నిన్ను నమ్మించారు."

"లేదు. స్కూలు రికార్డ్స్ అబద్ధం ఆడవు. మీరు సావిత్రిని ఎందుకు వదిలేశారు?"

"సావిత్రా?"

"అసలామెని పెళ్ళి చేసుకున్నారా లేదా?"

"సావిత్రిని పెళ్ళిచేసుకోవటమా? ఆవిడ పేరు వినటం ఇదే మొదటిసారి."

"చూడండి. జరిగింది జరిగినట్లు చెప్పండి. ఇలా నన్ను మభ్యపెట్టి, మోసం చేయటం అంటే నాకు పరమ రోత. అసహ్యం. మీరు నిజం చెప్పేదాకా మీరంటే అసహ్యం."

"ఎక్కడో పప్పులో కాలేశావ్. సావిత్రి ఎవరో నాకు తెలియదు."

"మీరు మొండేకాకపోగా, అలా మొండిగా వుండే విషయంలో కూడా మొండిగా వుంటారని యిప్పుడిప్పుడే అర్థమవుతోంది" తీవ్రంగా చెప్పింది నీరజ.

"మొండిగా వుండటం కాదు. నాకసలు సావిత్రెవరో తెలియదు మొర్రో అంటే వినవే?"

"మీరు మీ జీవితంలో తారసపడే అమ్మాయిలకి కాదు విలువ ఇవ్వాల్సింది. మీకు నచ్చిన అమ్మాయి జీవితానికి విలువ యివ్వాలి. నాకు తెలిసినంతలో సావిత్రి మీకు నాకన్నా మంచి భార్య అయివుండేది. ఆమె వ్యక్తిత్వం.."

"డామిట్, డామిట్, డామిట్. నేను పేళ్ళాడాలనుకున్న అమ్మాయి జయంతి. జయంతి... జయంతి... విన్నావా జయంతి. సావిత్రి కాదు" అరిచాడు సాంబశివరావు మంచమ్మీంచి లేచి నిలబడి.

సాంబశివరావు మొహంలో కోపాన్ని చూసి కొద్దిగా జరిగింది నీరజ. సాంబశివరావు కిటికీ దగ్గరకు వెళ్ళి వూపిరి పీల్చుకుని వదిలాడు.

"అయామ్ సారీ" చెప్పాడు.

తలుపు టకటక చప్పుడైంది. "నాన్నగారు విన్నట్లున్నారు" చెప్పాడు చటుక్కున వెనక్కి తిరిగి.

నీరజ లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా దశరథరామయ్య.

"రాజేష్ ఎందుకో అన్నమంతా కక్కుకున్నాడమ్మా" చెప్పాడు దశరథరామయ్య.

ఇద్దరూ బాత్‌రూం దగ్గరికి వెళ్ళారు. రాజేష్ తూముకుండే ఫిల్టర్ తీసి కక్కుకున్న అన్నాన్ని తూములోకి నెట్టాడు. ఫిల్టర్‌ని యథాస్థానంలో వుంచి చేతులు శుభ్రంగా కడుక్కొన్నాడు.

"రాజేష్, ఏమైంది?" అడిగింది నీరజ కంగారుగా.

"వామిట్ అయింది" చెప్పాడు.

"ఒంట్లో ఎలా వుంది?" అడిగింది బనీన్‌లోంచి అతని ఛాతీమీద చెయ్యిపోనిచ్చి టెంపరేచర్ చూస్తూ. జ్వరంలేదు.

"ఏం కాలేదు" చెప్పాడు రాజేష్.

"నన్ను పిలిస్తే నేను క్లీన్ చేసేదాన్నిగా?"

"ఫర్వాలేదండి"

"ఏమైంది?" అడిగాడు సాంబశివరావు నీరజ తిరిగి రాగానే.

"ఏం కాలేదు" చెప్పింది.

మంచం పక్కన దుప్పటి పరుచుకుని లైట్ ఆర్పేసింది. సాంబశివరావు అయిదారు నిముషాల తర్వాత లేచి భార్యమీద చెయ్యి వేశాడు చివాల్న ఆ చేతిని తోసేసింది నీరజ.

"ఎందుకు యిక్కడ? మంచం మీదకి రా" పిల్చాడు.

"నన్ను రెచ్చగొట్టకండి."

"ఇందులో రెచ్చకొట్టేదేముంది?"

"నిప్పు, తుపాకిమందు కలసి జీవించలేవు."

"అంటే?"

లేచి లైటు వెలిగించింది నీరజ ఆమె మొహం నిండా బాధ, కోపం, దుఃఖం, అవమానం సమానంగా అలుముకుని వున్నాయి.

"నీరజా! ప్లీజ్ నే చెప్పేది వినాలి"

నీరజ భర్త చేతుల్ని తన భుజాలమీదనించి విదిలించి కొట్టి చెప్పింది.

"నేను చెప్పేది మీరు వినాలి. రాజేష్‌ని ఏం చెయ్యదలచుకున్నారు?" అడిగింది నిప్పులు కక్కేలా చూస్తూ.

సాంబశివరావు జవాబు చెప్పలేదు.

"రాజేష్ గురించి మాట్లాడాలి. తెల్లారేలోగా మనం ఏదో ఒక నిర్ణయానికి రావాలి. చెప్పండి. ఇప్పుడేం చేస్తారు మీ కొడుకుని?" కళ్ళనీళ్ళు కారుతుంటే అడిగింది నీరజ.

సాంబశివరావు మొహంలోని సీరియస్‌నెస్ వెంటనే అధికం అయింది.

"అనవసరంగా ఎక్సయిట్ అవకు. నీ ఇష్టం. నువ్వు రాజేష్‌ని ఎక్కడికి పంపించమంటే అక్కడికి పంపిస్తాను. ఈ ఇంట్లో మాత్రం వుండడు. సరేనా?" మృదువుగా చెప్పాడు.

"రాజేష్ గురించి మీకు సావిత్రి ఉత్తరం రాయలేదా?" అడిగింది నీరజ.

"నాకసలు సావిత్రి తెలియనే తెలియదు."

భార్య మొహంలోని భావాలనిబట్టి తన మాటలు నమ్మలేదని గ్రహించి మళ్ళీ చెప్పాడు.

"లేదు."

"రాజేష్‌ని ఎవరింటికి పంపించదలుచుకున్నారు?"

"ఎవరింటికి పంపిస్తే ఎవరు మాత్రం వాణ్ణి భరిస్తారు? రాజేష్ తల్లి యిలా చేయకుండా వుండాల్సింది. తనని ద్వేషించే భార్య వున్న ఏ భర్తా సుఖంగా, శాంతిగా నిద్రపోలేడు. ఈ రాస్కెల్ గాడిని వదిలించుకుంటే కాని ఈ ఇంట్లో ఎవరికీ శాంతి వుండదు."

నీరజలోని ఆవేశం కొద్దిగా తగ్గింది.

"ఐ యామ్ సారీ ఫర్ లూజింగ్ మై టెంపర్" చెప్పింది.

సాంబశివరావు బదులు చెప్పలేదు.

13

పంచాక్షరరావు భార్య సాహితికి గత మూడు రోజులుగా మనఃశ్శాంతి లేదు. సాంబశివరావు ఇంట్లో ఏదో జరుగుతోందని తెలుసుకాని, ఏం జరుగుతుందో స్పష్టంగా తెలియదు. తెలుసుకునేదాకా నిద్రపట్టదు. ఎవరిని అడగాలి? పక్క వాళ్ళిళ్ళకి వెళ్ళటం నామోషీగా భావిస్తుందామె.

భర్తని నాలుగైదుసార్లు రాజేష్ గురించి అడిగింది కాని అతను నీకెందుకని విసుక్కున్నాడు. దాంతో, ఆమెలోని ఆసక్తి రెట్టింపయింది.

వంటగదిలో పనిచేసుకుంటూంటే, గది కిటికీలోంచి ఏదో వచ్చి ఆమె తలకి తగిలింది. దాన్ని పట్టించుకోలేదు.

ఇంకోటి వచ్చి తగిలింది. కింద పడ్డదాన్ని చూస్తే శెనగగింజ. కిటికీ దగ్గరికి వెళ్ళి బయటికి చూసింది కానీ ఎవరూ కనపడలేదు.

బయట ఎవరో తలుపు దబదబా కొడూతున్న చప్పుడు వినిపించింది వెళ్ళి తలుపు తీసి చూసింది.

బన్నీ.

"ఏమిటి?" అడిగింది సాహితి.

"ఏం లేదు. వూరికే వచ్చాను" చెప్పింది లోపలికి వచ్చి కూర్చుని.

"మీ నాన్నగారు కేంప్‌నించి తిరిగి వచ్చారా?" అడిగింది సాహితి.

"ఊహూ."

నాకవతల పనుంది."

"మీ పక్కింట్లో దెయ్యం వుంది" చెప్పింది బన్నీ.

"దెయ్యమా?"

"అవును."

"నువ్వు చూశావా?"

"లేదు. ఆవిడ వంట చేసుకుంటూంటే బయటనించి ఓ దెయ్యం ఆవిడ మీదకి శెనగ గింజలు, పెసరబద్దలు విసిరికొడుతోందిట. భయపడి ఇల్లు ఖాళీ చేసేస్తారట."

సాహితికి అర్థమైంది, తనమీద శెనగగింజలు ఎవరు విసిరారో.

"వెధవ పుస్తకాలు చదివి పాడయిపోతున్నావ్. దెయ్యమేంటే దెయ్యం. నన్ను దడిపిద్దామనే?" కోపంగా అడిగింది సాహితి, చెవి మెలిపెట్టి.

బన్ని పకపకా నవ్వింది. గౌను జేబులోంచి శెనగబద్దలు తీసినోట్లో వేసుకుని నమలసాగింది.

"సాంబశివరావు ఇంట్లో ఆ కుర్రాడెవరే?" అడిగింది సాహితి.

"వాళ్ళబ్బాయి. పేరు రాజేష్" చెప్పింది బన్నీ.

"ఎవరబ్బాయి?"

"సాంబశివరావుగారి అబ్బాయి."

"అదేమిటి? ఆయనకి పెళ్ళయి నెలకూడా దాటలేదుగా?"

"ఏమో మరి."

"ఎవరి కొడుకు? సాంబశివరావు కొడుకా? లేక నీరజ కొడుకా?"

"సాంబశివరావు కొడుకు."

"వాణ్ణి ఓసారి తీసుకురా" అడిగింది.

"దేనికి?" కాళ్ళూపుతూ బన్ని ప్రశ్నించింది.

"పనుంది."

"ఎప్పుడైనా తెస్తాలే."

"సాయంత్రం పాలకోవా చేస్తున్నాను. మీ ఇద్దరూ రండి."

"పాలకోవానా?" ఆశగా అడిగింది బన్ని.

"అవును. నాలుగన్నరకి రండి."

మరో రెండు నిముషాల్లో బయటికి వెళ్ళిపోయింది. ఎక్కడా కుదురుగా అయిదు నిముషాలు కూడా కూర్చోలేదు బన్ని.

సాంబశివరావు ఇచ్చిన ప్రకటనని చదివాడు ఆ దినపత్రిక అడ్వర్‌టైజ్‌మెంటు మేనేజర్.

**సావిత్రి,**

**మీ అబ్బాయికి ఒంట్లో బాగోలేదు. ఈ ప్రకటన చదివిన తక్షణం హైదరాబాద్ రావలసిందిగా కోరుతున్నాను.**

**సాంబశివరావు.**

"ఈ ఫోటో?" అడిగాడు ఆయన రాజేష్ ఫోటోని చూసి.

"ఇది వేరే ప్రకటన. ఏం రాయాలో ఫోటో వెనకాల రాసాను."

ఆయన ఫోటో తిప్పి వెనక రాసిన వాక్యాలు చదివాడు.

"ఈ అబ్బాయి పేరు రాజేష్. ఇతని తల్లిదండ్రులు వివరాలు తెలియచేసిన వారికి నూటపదహార్లు బహుమతి యివ్వబడును."

"కేరాఫ్ బాక్స్ నంబర్ యివ్వండి" చెప్పాడు సాంబశివరావు.

"ఈ రెండు ప్రకటనలు ఒకరి గురించేనా?" అడిగాడు ఆయన.

సాంబశివరావు ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు.

"ఇది కేవలం విజయవాడ ఎడిషన్‌లోనే రావాలి. హైదరాబాద్ ఎడిషన్‌లో రాకూడదు. ఎంతవుతుంది?"

ఆయన లెక్కవేసి చెప్పాడు, డబ్బు చెల్లించి చెప్పాడు సాంబశివరావు "నాకు ఆ పత్రికని, ఉత్తరాలని ఈ చిరునామాకి పంపే ఏర్పాటు చేయండి."

తన బేంక్ చిరునామా రాసివున్న కాగితం అందించాడు ఆయనకి.

బయటకు వచ్చి స్కూటర్ స్టార్ట్ చేశాడు. యాంత్రికంగా బండిని నడుపుతున్నాడు కానీ, అతని మనసునిండా రకరకాల ఆలోచనలు.

హైదరాబాద్ ఎడిషన్‌లో వస్తే ఆ ప్రకటన నీరజ చూసే అవకాశ్మ వుందని వద్దనుకున్నాడు. ఒకవేళ సావిత్రి హైదరాబాద్‌లోనే వుంటే కనీసం సావిత్రి వివరాలు విజయవాడనించి ఎవరైనా తనకి రాయవచ్చని ఆశ సాంబశివరావుకి బాగా వుంది.

దశరథరామయ్య, రాజేష్ క్రేయాన్స్‌తో తెల్లగాగితాలమీద గీసిన కుక్కబొమ్మని చూసి అడిగాడు.

"నీకు కుక్కలంటే ఇష్టమా?"

"ఉహూఁ. బాగా భయం. కరుస్తాయి."

తెల్లటి మీసాల చాటునుంచి చిన్నగా నవ్వి చెప్పాడు దశరథరామయ్య.

"ఒరి భడవా! ప్రతి కుక్కకీ ఒక్కసారయినా కరిచే హక్కుందిరా. కరవకపోతే అది కుక్కేకాదు. కుక్కలు ఒకప్పుడు అడవుల్లోనే వుండేవని తెలుసా?"

తెలియదన్నట్లుగా రాజేష్ తల అడ్డంగా వూపాడు.

"కుక్క మనిషి దగ్గరకి ఎలా వచ్చిందో చెప్పనా?"

"కథా తాతయ్యా?"

"అవునా"

"చెప్పు తాతయ్యా" ఉత్సాహంగా ముందుకి వంగి చెప్పాడు రాజేష్.

"అనగనగా ఒక వూళ్ళో ఒక అడవి వుంది. ఆ అడవిలో..."

"తాతయ్యా అడవి ఊరి బయట వుంటుంది. ఊళ్ళో ఉండదు" అడ్డుపడ్డాడు రాజేష్.

"నిజమేరోయ్. సరే ఓ అడవి వుంది. ఆ అడవిలో ఓ కుక్క వుంది. అప్పటికింకా కుక్కలు అడవిలోనే వుండేవన్నమాట"

"ఆ కుక్కపేరు? "

"డానీ అందాం. సరేనా?"

"డానీ, సరే"

"అమ్మా, నాన్నలేరు. డానీ వంటరిగా నివశించేది. దానికి ఆ వంటరితనం భరించరానిదిగా వుండటంతో, మంచి స్నేహితుడ్ని వెదుక్కుంటూ బయలుదేరింది. అడవిలో నడిచి, నడిచి వెళితే చివరకు ఓ కుందేలు కనబడింది. ఎవరికి కనబడింది?"

"డానీకి"

"గుడ్, కుందేలా మనిద్దరం స్నేహంగా వుందాం. సరేనా?" అడిగింది డానీ. కుందేలు ఒప్పుకుంది. రాత్రి వంట చేసుకుని తిని రెండూ పడుకున్నాయి. ఓ అర్ధరాత్రి డానీకి కొమ్మవిరిగిన చప్పుడు వినిపించడంతో లేచి మొరగసాగింది. కుందేలు భయంతో ఓ గెంతువేసి నిలబడి ఎందుకు మొరుగుతున్నావ్? కొంపతీసి తోడేలుకానీ వచ్చిందేమో? అది మనిద్దర్నీ తినేయగలదు" అన్నది.

"ఈ కుందేలు పిరికిది. దీనితోకన్నా తోడేలుతో స్నేహం చేయడం మంచిది అనుకుని ఆ కుక్క మర్నాడు తోడేలును వెదుక్కుంటూ వెళ్ళింది.

'తోడేలా తోడేలా మనిద్దరం స్నేహంగా వుందామా?' అడిగింది. తోడేలు సరే అంది. ఆ రాత్రి వంట చేసుకుని తిని ఆ రెండూ పడుకున్నాయి. ఏ రెండూ?

"తోడేలు, డానీ."

"గుడ్ అర్ధరాత్రి కుక్కకి ఏదో చప్పుడు వినిపించి గట్టిగా మొరిగింది. నిద్రలో వున్న తోడేలు వులిక్కిపడి లేచి 'కొంపతీసి సింహంగానీ వచ్చిందా? అది మనిద్దర్నీ తినేస్తుంది' అన్నది.

మర్నాడు కుక్క 'తోడేలుకన్నా శక్తిగల సింహంతోనే స్నేహం చేస్తా'నని అనుకుని సింహాన్ని వెదుక్కుంటూ బయలుదేరింది.

ఆ అడవిలో నడిచి నడిచి అలా చాలా దూరం వెళ్ళాక సింహం కనిపించింది."ఎవరికి కనిపించింది అని దశరథరామయ్య అడక్కుండానే ఊపిరి తీసుకోడానికి ఆగడంతో "డానీకి కనిపించింది" చెప్పాడు రాజేష్.

ఆయన చిన్నగా నవ్వి మొదలుపెట్టాడు.

"సింహమా మనిద్దరం స్నేహంగా వుందామా అని డానీ అడిగింది. సింహం సరేనంది. ఆ తర్వాత" అడిగాడు దశరథరామయ్య.

"ఆ రాత్రి రెండూ వంట చేసుకుని తిని పడుకున్నాయి మళ్ళీ ఏదో చప్పుడు విని డానీ గట్టిగా మొరిగింది. సింహం 'ఎందుకు మొరుగుతున్నావ్? నేను బలంగలదాన్ని. ఎవడొచ్చినా చంపేస్తా' అంది అంతేకద తాతయ్యా?"

దశరథరామయ్య నవ్వాడు.

"కాదురా మనవడా! సింహం భయపడే ప్రాణి ఏదో తెలియదా నీకు?"

రాజేష్ కాసేపు ఆలోచించి "ఏనుగా?" అడిగాడు.

"కాదు. సింహం నిద్రలో ఉలిక్కిపడి లేచి 'డానీ కొంపదీసి మనిషికానీ వచ్చాడా మొరుగుతున్నావ్?'అని భయపడుతూ అడిగింది. సింహంకన్నా మనిషి శక్తివంతుడని కుక్క మర్నాడు సింహాన్ని వదిలి మనిషిని వెదుక్కుంటూ బయలుదేరింది. నాలుగయిదు రోజులు అడవంతా గాలించినా మనిషి కనపడలేదు. చివరికి కట్టెలు కొట్టడానికి వచ్చిన మనిషి కనపడ్డాడు.

'ఓ మనిషీ నువ్వూ నేనూ స్నేహంగా వుందామా?' అని అడిగితే మనిషి సరేనన్నాడు. మనిషి డానీని తనింటికి తీసుకెళ్ళాడు. ఆ రత్రి వంట చేసుకుని తిని డానీ, మనిషీ పడుకున్నాడు. అర్ధరాత్రి చప్పుడయితే డానీ గట్టిగా మొరిగింది. మనిషి నిద్రలేచి గట్టిగా అరిచాడు. 'నీకు ఆకలేస్తే వంటగదిలోకి వెళ్ళి ఏదయినా తినుకానీ, నన్ను లేపకు" డానీ అనుకుంది 'అమ్మయ్య ఎవరికీ భయపడని వ్యక్తి యిప్పటికి దొరికాడు' అనుకుని అప్పట్నుంచీ కుక్క మనిషితోనే వుంటోంది."

"మా అమ్మ ఈ కథ ఎప్పుడూ చెప్పలేదు. భలే బావుంది తాతయ్యా" చెప్పాడు రాజేష్.

"కథయిపోయిందిగా ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు దశరథరామయ్య.

"ఇప్పుడేం చేద్దాం?" రాజేష్ కూడా అడిగాడు. క్షణం తర్వాత లేచి బయటికి పరిగెత్తాడు. నిముషంలో చేతుల్లో కొబ్బరి ఆకులతో వచ్చాడు.

"దీంతో బూర ఎలా చేయాలో చూపిస్తాను" రాజేష్ తన చిన్న వేళ్ళతో లాఘవంగా కొబ్బరి ఆకును చుట్టి చిన్న బూరని తయారుచేశాడు. దాన్ని నోట్లో వుంచుకుని గట్టిగా వూదాడు. బూర విజిల్‌లా పలికింది.

"బావుందా తాతయ్యా?"

"బావుందిరా"

"నీకూ చేసిస్తానుండు."

మళ్ళీ ఇంకో ఆకుతో బూరని చుట్టి దశరథరామయ్యకి అందించాడు. రాజేష్ కళ్ళు ఏదో వింత కోసం ఎదురు చూస్తున్నట్లుగా చూశాయి. దశరథరామయ్య ఆ బూరని నోట్లో వుంచుకుని గట్టిగా వూదాడు.

దాంట్లోంచి శబ్దం రాలేదు. బూర పొడుగ్గా పొడుచుకు వచ్చింది. రాజేష్ పకపకా నవ్వాడు దశరథరామయ్య ఆశ్చర్యాన్ని గమనించి.

మళ్ళీ ఇంకో బూర చుట్టిచ్చాడు.

దాంట్లోంచి ఈసారి శబ్దం వచ్చింది. 'తూతూ తూతూ తూతూ'

"మా అమ్మ నా చేత బొమ్మల పెళ్ళి చేయించినప్పుడల్లా యివి చుట్టిచ్చేది. పెళ్ళి బాజాలన్నమాట."

అరగంటలో ఆ ఆటంటే ఉత్సాహం పోయింది యిద్దరికీ.

"ఇప్పుడేం చేద్దాం?"అడిగాడు దశరథరామయ్య.

రాజేష్ కాసేపు ఆలోచించి చెప్పాడు.

"ఆ చేతిలో ఏం వుందో కనుక్కునే ఆటాడదామా? అది ఎలా ఆడాలంటే..... "

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in